BREAKING EDITION
బ్రేకింగ్ ఎడిషన్

Follow: @ANNTELUGU
మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ 26-02-2025
WWW.EPAPER.MAHAADAILY.COM
ann తెలుగు



# ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచితీరాలి

- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ జూమ్ మీటింగ్
- కాంగ్రెస్ క్యాడర్‌కు దిశానిర్దేశం

**మహా, హైదరాబాద్:** ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ బుధవారం పార్టీ నాయకులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి నాలుగు ఉమ్మడి జిల్లాల (ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ కరీంనగర్) మండల అధ్యక్షులతో జూమ్ మీటింగ్ ద్వారా మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపు సాధనకు అనుసరించాల్సిన వ్యూహాలపై మండల అధ్యక్షులతో చర్చించి దిశా నిర్దేశం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు కార్యకర్తలను సమాయత్తం చేయాలని మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాది వ్యవధిలోనే 55 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని.. భవిష్యత్ లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయనుందన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పట్టభద్రుల్లో, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో కాంగ్రెస్ పట్ల నెలకొన్న సానుకూలతను పోలింగ్ లో ఓట్లుగా మలుచుకునేందుకు పార్టీ నాయకులు కృషి చేయాలని కోరారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలు రెండింటికి, నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి గురువారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగునుంది. వచ్చే నెల 3న కౌంటింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు.

# ప్రాజెక్టులకు నిధులివ్వండి

## బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించండి

## ప్రధాని మోదీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

## కీలక అంశాలపై చర్చ

## పెండింగ్ నిధులూ విడుదలకు వినతి





**మహా, న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ బుధవారం ఉదయం ప్రధాని అధికారిక నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలపై ప్రధానితో రేవంత్ చర్చించారు. తెలంగాణలో చేపట్టిన పలు ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పెండింగ్ నిధులూ విడుదల చేయాలని కోరారు.

**పీఎం దృష్టికి పెండింగ్ సమస్యలు**

ఫేస్ 2 మెట్రో లైన్, ఎయిర్‌పోర్ట్ పొడగింపు..దానికి కావాల్సిన ఆర్థిక సహాయం.. అనుమతులు, మూసీ నది సుందరీకరణ నిధులు, కేంద్రం నుంచి వెనకబడిన జిల్లాలకు రావాల్సిన నిధులు, తెలంగాణకు ఐటీఐఆర్, ఐఐఎం, రీజనల్ రింగ్ రోడ్డుకు అనుమతులు, ఆర్థిక సహాయం వంటి అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని పెండింగ్ సమస్యలను ప్రధాని దృష్టికి తెలంగాణ ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. వాటిని త్వరగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

**ఎస్ఎల్‌బీసీపై పీఎం ఆరా**

అయితే చర్చ సందర్భంగా ఎస్ఎల్‌బీసీ ప్రమాదం గురించి ప్రధాని మోదీ అడిగారు. పరిస్థితి ఎలా ఉందంటూ ఆరా తీశారు. టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికులను కాపాడేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయని రేవంత్ చెప్పారు. భారీగా నీరు, బురద పేరుకుపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రేవంత్ రెడ్డితోపాటు ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, డీజీపీ జితేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం పలువురు కేంద్రమంత్రులనూ రేవంత్ రెడ్డి కలిసే అవకాశం ఉంది.

## రేవంత్ సర్కార్ తీపికబురు

### ఉపాధి కూలీల ఖాతాల్లో రూ.39.74 కోట్లు జమ

మహా, హైదరాబాద్: మహా శివరాత్రి వేళ రేవంత్ సర్కార్ తీపి కబురు చెప్పింది. ఉపాధి హామీ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు విడుదల చేసింది. ఎన్నికల కోడ్ అమల్లో లేని ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాల్లో నిధులు జమ అయ్యాయి. ఎన్నికల కోడ్ ముగియగానే మిగతా లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు జమకానున్నాయి. మొత్తం 18,180 మందికి రూ.6 వేల చొప్పున జమ చేసింది. ఆ రెండు జిల్లాల్లో 66, 240 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. వీరి ఖాతాల్లో రూ.39.74 కోట్లు జమ చేశారు. ఇప్పటివరకు మొత్తం 83,420 మంది ఉపాధి కూలీలకు రూ.50.65 కోట్లు చెల్లింపు చేశారు. ఎన్నికల కోడ్ ముగియగానే మిగతా లబ్ధిదారులందరికీ నిధులు డిబిటి పద్ధతిలో కూలీల ఖాతాల్లోకి నేరుగా చేరనున్నాయి. జనవరి 26న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది.

# ఎల్లుండి రాష్ట్రానికి మీనాక్షి

## పీసీసీ సమావేశానికి హాజరుకానున్న పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి



**మహా, హైదరాబాద్:** తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ శుక్రవారం తొలిసారిగా రాష్ట్రానికి రానున్నారు. ఆరోజు గాంధీభవన్ లో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరుగనున్న టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశానికి మీనాక్షి నటరాజన్ హాజరవుతారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా సమావేశానికి హాజరుకానున్నారు. దీపాదాస్ మున్షి స్థానంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జిగా నియామితులైన పిదప మీనాక్షి నటరాజన్ తొలిసారిగా రాష్ట్రానికి రానున్న నేపథ్యంలో పార్టీ వర్గాలు ఆమెకు ఘన స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యాయి. అయితే మీనాక్షి నటరాజన్ రాక సందర్భంగా ఎలాంటి స్వాగత తోరణాలు, ఫ్లెక్సీలు, హంగు ఆర్భాటాలు చేయవద్దని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ శ్రేణులకు స్పష్టం చేశారు. బోకెలు, శాలువలు కూడా తీసుకరావద్ధంటూ ఆదేశాలిచ్చారు.





# ముక్కంటి సేవలో భక్తకోటి

## వైభవంగా మహాశివరాత్రి వేడుకలు

- మహాశివుడికి విశేష అభిషేకాలు
- భక్తజనంతో కిక్కిరిసిన ఆలయాలు
- శివనామస్మరణతో మారుమోగుతున్న శైవ క్షేత్రాలు





**మహా, హైదరాబాద్:** తెలంగాణలో మహా శివరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. హర హర మహాదేవ.. అంటూ నీలకంఠ స్వామిని భక్తిప్రపత్తులతో కొలిచేందుకు చిన్నా, పెద్ద అందరూ బుధవారం తెల్లవారుజామునుంచే ఆదిదంపతులను దర్శించుకునేందుకు శివాలయాలకు క్యూ కట్టారు. నగరంలోని ఆలయాలను విద్యుద్దీపాల అలంకరణలతో అందంగా ముస్తాబు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథలు, భజనలు, సంకీర్తలను నిర్వహిస్తున్నారు. శివనామ స్మరణతో సిరిసిల్ల జిల్లాలోని రాజన్న క్షేత్రం మారు మోగుతోంది. సుమారు మూడు లక్షల మంది భక్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు భారీ ఏర్పాట్లు సైతం చేశారు. చేసినట్లు ఆలయం అధికారులు తెలిపారు. స్వామి వారి దర్శనానికి ఐదు గంటల సమయం పడుతోంది.

**భక్తుల పుణ్యస్నానాలు**

మంచిర్యాల జిల్లా కేంద్రంతో పాటు గూడెం, లక్షెట్టి పేట, చెన్నూరు గోదావరి నది తీరాల్లో భక్తుల పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. వేలాల మల్లిఖార్జున స్వామి ఆలయం, కత్తరశాల మల్లన్న, బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. నిర్మల్ జిల్లా బాసరలో మహా శివరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. గోదావరి నది తీరంలో భక్తుల పుణ్య స్నానాలు చేస్తున్నారు. సోన్, ఖానాపూర్ గోదావరి నది తీరాల్లో భక్తుల రద్దీ నెలకొంది. జిల్లా కేంద్రంలోని శివాలయాలు భక్తులతో కిట కిట లాడుతున్నాయి. కొమురం భీం జిల్లా ఈజ్‌గాం శివ మల్లన్న, వాంకిడి శివ కేశవ ఆలయాల్లో వైభవంగా మహా శివరాత్రి వేడుకలు జరుగుతున్నాయి. జాతరలకు భక్తులు భారీగా తరలి వస్తున్నారు.



## టన్నెల్‌లో చిక్కుకున్న వారి కోసం కోమటిరెడ్డి పూజలు

నాగర్‌కర్నూలు, మహా: ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న వారి క్షేమం కోసం మంత్రి కోమటిరెడ్డి శ్రీశైలంలో పూజలు చేశారు. బుధవారం ఉదయం దోమలపెంట నుంచి శ్రీశైలం మహాపుణ్యక్షేత్రానికి వెళ్లారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మంది సురక్షితంగా తిరిగిరావాలని ఆయన ప్రత్యేక పూజలు చేయించారు.

# రాజన్న గుడికి బీఆర్ఎస్ ఏం చేసింది

## నాడు రూ.100 కోట్లు ఇస్తానని మోసం

- కవితవన్నీ కాకమ్మ కబుర్లే
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఫైర్



**మహా, వేములవాడ:** మహాశివరాత్రిని పురస్కరించుకుని వేములవాడ రాజన్నను దర్శించుకున్న ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలన్నీ కాకమ్మ కబుర్లే అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కవిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. గత బీఆర్ఎస్ పది సంవత్సరాల పరిపాలనలో రాజన్న గుడికి చేసింది ఏమీ లేదని, కేసీఆర్ తో పాటు తన లగ్గం కూడా ఇక్కడే అయిందని ఆమె చెప్పడం సిగ్గు చేటన్నారు. రాజన్న ఆలయానికి ఏటా రూ.100 కోట్లు ఇస్తానని భక్తులను మోసం చేశారని అన్నారు. ఆలయ అభివృద్ధికి బడ్జెట్‌లో ఏనాడూ అణాపైసా కేటాయించలేదని, తాము బడ్జెట్ లో నిధులు కేటాయిస్తామని ఏనాడూ చెప్పకుండానే రూ. 50 కోట్లు కేటాయించినట్లు గుర్తు చేశారు. కవిత ఎవరో చెప్పిన స్క్రిప్ట్ చదివారని, మహాశివరాత్రి వచ్చిందంటే వారు రంగు రంగు బ్రోచర్లతో రాజన్న భక్తులను మోసం చేశారని గుర్తు చేశారు. తిప్పాపూర్ మూడవ బ్రిడ్జి నిర్మాణానికి కనీసం భూ సేకరణ చేయకుండానే వాటిని నిర్మించినట్లు గ్రాఫిక్స్ లో చూపించారని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి చొరవతో రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.75 కోట్లు కేటాయించడం జరిగిందని, రూ. 47 కోట్లతో వేములవాడ పట్టణంలో రోడ్డు వెడల్పు చేపడుతున్నామని అన్నారు. గుడి చెరువులో, మూలవాగులో మురికి నీరు కలవకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. వచ్చే మహా శివరాత్రి వరకు రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మహాశివరాత్రి ఆహ్వాన పత్రిక అందజేసిన సమయంలో ఆలయ విస్తరణ పనులపై ఆరా తీశారని, గత ప్రభుత్వంలాగా పనుల్లో నిర్లక్ష్యం చేయకుండా ఉండాలని ఆదేశించినట్లు తెలిపారు.